# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లాలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రేపు పాల్గొంటారు**
2. **ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.**
3. **పిఎస్ఎల్వీ సి60 రాకెట్ ప్రయోగం ద్వారా స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను ఈరోజు ప్రయోగించనున్నామని ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ పేర్కొన్నారు.**
4. **నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రిస్తున్నామని విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు తెలిపారు.**
5. **మహా కుంభమేళాకు విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.**

==========================

పల్నాడు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నరసరావుపేట నియోజకవర్గం యల్లమంద గ్రామంలో రేపు ఉదయం జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. అనంతరం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ తెలిపారు.

--------------------------

ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సేవాసంస్థలు అందించే ఈ మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

--------------------------

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ - ఇస్రో ఈరోజు ప్రయోగించనున్న పీఎస్ఎల్వీ సీ-60 రాకెట్ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్. తెలిపారు. తిరుపతి జిల్లా

సూళ్లురుపేటలోని శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవి ఆలయంలో ఈరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పిఎస్ఎల్వీ సి60 రాకెట్ ప్రయోగం ద్వారా స్పాడెక్స్ అనే రెండు జంట ఉపగ్రహాలను 470 కిలోమీటర్ల ఎత్తులో భూ సమాంతర కక్ష్యలోని పంపుతున్నామని చెప్పారు. అదే విధంగా ఈ స్పాడెక్స్ ఉపగ్రహాల ద్వారా స్పేస్ డాకింగ్ అనే సరికొత్త సాంకేతికతను పరిగణలోకి తీసుకునేందుకు ఈ రాకెట్ ప్రయోగం చేపట్టామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి–సీఎస్‌గా కె.విజయానంద్ నియమితులయ్యారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన్ను సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం గత రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విజయానంద్ ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ రేపు పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో ఆ స్థానంలో కొత్త సీఎస్‌గా విజయానంద్ బాధ్యతలు చేపడతారు. కాగా వైఎస్సార్ జిల్లా రాజుపాలెం మండలం అయ్యవారిపల్లె విజయానంద్ స్వస్థలం.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం సాగరతీరంలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయస్థాయి మహిళా బీచ్ వాలీబాల్ క్రీడా పోటీలు నిన్నటితో ముగిసాయి. ఈ పోటీలలో ఎనిమిది జట్లు పాల్గొనగా తమిళనాడు, వెల్స్ విశ్వవిద్యాలయానికి చెందిన జట్ల మధ్య జరిగిన తుది పోటీలో తమిళనాడు జట్టు ట్రోఫీని కైవశం చేసుకుంది. ఈ సందర్భంగా అమలాపురం శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం క్రీడలతోపాటు పర్యాటకానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తోందన్నారు.

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రిస్తున్నామని విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు తెలిపారు. విజయవాడలో పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ 2024 వార్షిక నేర సమీక్షను విడుదల చేశారు .అనంతరం ఆయన మాట్లాడుతూ, కృత్రిమ మేధ పరిజ్ఞానంతో నేరాలను కట్టడి చేస్తున్నామన్నారు. డ్రోన్స్ సహకారంతో క్లౌడ్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సైబర్ నేరాలపై విస్తృత అవగహన కార్యక్రమాలను చేపట్టామని ఎస్.వి రాజశేఖర్ బాబు తెలిపారు.

---------------------------

గిరిజన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని గుమ్మలక్ష్మీపురంలో గిరిజన సంప్రదాయ కందికొత్తల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని ఆదివాసీలతో కలిసి గిరిజన నృత్యాన్ని చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రహదారుల్లేని గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు

అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని  చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిలో గిరిజనులు రాణించేలా డిఎస్‌సి శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న మహా కుంభమేళాకు విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి–బెనారస్ ప్రత్యేక రైలు జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 23 తేదీల్లో శనివారం రాత్రి 8 గంటల 55 నిమిషాలకు తిరుపతిలో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 3 గంటల 45 నిమిషాలకు బెనారస్ చేరుకుంటుందని, తిరుగు ప్రయాణంలో ఈ రైలు మరుసటి రోజు సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు బయలుదేరుతుందని తెలిపారు. ఈ రైళ్లు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ తదితర స్టేషన్లలో ఆగుతుందని అధికారులు వెల్లడించారు.

---------------------------

బేటీ బచావో, బేటీ పఢావో అనే నినాదంతో  బాలిక విద్య, సంక్షేమం కోసం ప్రాధాన్యమిస్తోన్న కేంద్రప్రభుత్వం వారి ఆర్థిక భద్రత దిశగా ఏర్పాటు చేసిన సుకన్య సమృద్ధి యోజన తిరుపతి జిల్లాలో సత్ఫలితాలిస్తోంది. తిరుపతి జిల్లాలోని తొట్టంబేడు మండలంలో ఈ పథకం కింద తపాలాశాఖ, బ్యాంకుల్లోను అధిక సంఖ్యలో తల్లిదండ్రులు తమ పిల్లల పేర్ల మీద ఖాతాలను ప్రారంభించారు. ఈ పథకం తమకు ఎంతగానో ఉపయోగపడుతోందని స్థానికురాలు జీవిత తెలియచేస్తూ ..

వాయిస్.. 14  సెకన్లు

---------------------------

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యుల (Electronic Know Your Customer) ఈ–కేవైసీకి సంబంధించి  ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అనంతపురం  జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ నారాయన్ శర్మ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకమైన ప్రాథమిక సహకార సంఘాల–పీఏసీఎస్ ఆధునీకరణలో భాగంగా రికార్డులలో ఈకేవైసీ నవీకరించుకోవాలని తెలిపారు.  జిల్లాలోని అన్ని సహకార సంఘాల సభ్యులు సంబంధిత సచివాలయాల్లో   ఈ కేవైసిని పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

=====================